సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 19-11-2024

సంపుటి: 20 సంచిక: 200

పేజీలు: 4 వెల: రూ.1

## బడుగుల ఉన్నతికి ఇందిర కృషి ఎనలేనిది



(సత్యంన్యూస్, టెక్కలి)

దేశ అభివృద్ధికి, బడుగుల ఉన్నతికి ఇందిరా గాంధీ చేసిన కృషి ఎనలేనిదని కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ కూడలిలోని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ కిసాన్ అధ్యక్షులు కోత మధుసూదన్‌రావు, టెక్కలి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్నూరు ఆనందరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు టంకాల బాల గంగాధర గుప్త, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు డి.ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాట్ల లింగమూర్తి, కోత శంకర ప్రసాద్, టి.మాధవరావు, గోరంట సుబ్బారావు, పి.సూర్యనారాయణ, డి.వెంకట్రావు, పీవీఎస్ సరోజిని, బొరిగి కృష్ణ, సతీష్, పి. సత్యనారాయణ, జె.హేమసుందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



- వంశధార లెఫ్ట్ కెనాల్ ప్రారంభంలో పూడికే కారణం
- అధిక వర్షపాతంతో గట్టెక్కిన రైతులు
- జిల్లాలో తగ్గిన వరి విస్తీర్ణం
- ఇంకా అంచనాల దశలోనే ఆధునికీకరణ

# నిధులు పారాయి...
# నీరే చి'వరి'కి చేరలేదు





వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు (ఫైల్‌ఫోటో)



తాడివాడ, కిడిసింగి చెరువుకు నీరు రాని పరిస్థితి (ఫైల్‌ఫోటో)

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార ఎడమ ప్రధాన కాలువ శివారు ప్రాంతాలకు నీరందించడానికి కాలువల్లో గుర్రపుడెక్కను తొలగిస్తే శివారు ప్రాంతాలకు నీరందించవచ్చున్న ఆలోచనతో కొవ్వాడ ఇంట్రస్ట్ ఫండ్ నుంచి జులైలో రూ.40లక్షలు మంజూరు చేయించి నామినేషన్ పద్ధతిలో పలాస, టెక్కలి నియోజకవర్గాల కాలువ శివారు ప్రాంతాల్లో గుర్రపు డెక్కలను తొలగించే పనులు చేపట్టారు. అయితే.. తల పని విడిచిపెట్టి తోక పని చేయడం వల్ల రూ.40 లక్షలు ఖర్చు చేసినా లక్ష్యం నెరవేరలేదు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో 5,978 ఎకరాల్లో, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు కలిపి 1193 ఎకరాల్లో వరిసాగు చేయలేకపోయారు. అక్టోబర్‌లో అల్పపీడనం ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు పొట్ట దశలో ఎండిపోతున్న వరి బతికి బట్టకట్టింది. వంశధార ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు నీరందించే సాగునీటి కాలువ సామర్థ్యం 20 ఏళ్ల క్రితం 2,460 క్యూసెక్కులు ఉండగా, ప్రస్తుతం అది 1800 క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో గత కొన్నేళ్లుగా శివారు భూములకు నీరందడం లేదు.

**తగ్గిన పంట విస్తీర్ణం**

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, 3,80,615 ఎకరాల్లో విత్తనాలు వేశారు. ఖరీఫ్‌లో అనుకున్న లక్ష్యంలో మొత్తం 41,040 ఎకరాల మేర తగ్గింది. వరి పంటను 3,87,323 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా, 3,55,618 ఎకరాల్లో సాగవుతున్నట్లుగా నమోదైంది. అధికారుల లెక్కల ప్రకారం వరి సాగు 31,705 ఎకరాల మేర తగ్గింది. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం కంటే అదనంగా 16 శాతం నమోదైంది. జిల్లాలో 17 మండలాల్లో సాధారణ

- మిగతా 4లో

## స్వచ్ఛ శ్రీకాకుళమే లక్ష్యం

- మహిళలకు పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం
- మిషన్ మోడ్‌లో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణం
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వచ్ఛ శ్రీకాకుళమే మన లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా బలగలోని చంద్రయ్య కాలనీ, అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర మోడల్ టాయిలెట్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి ఆయన మంగళవారం ప్రారంభించారు. అంతకుముందు మరుగుదొడ్ల మందు ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా మనమంతా పనిచేద్దామన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని శ్రీకాకుళంలో కమ్యూనిటీ మరుగుదొడ్లను ప్రజలు వినియోగించే విధంగా మరమ్మతులు చేపడతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేక ఆడపడుచులు వివక్షకు గురవుతున్నారని, ఆత్మగౌరవానికి సంబంధించి ఎంతో ఇబ్బంది పడేవారని, ఆ పరిస్థితి లేకుండా ప్రతీ మహిళకు గౌరవం దక్కేలా ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఒక మిషన్ మోడ్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను ఓడిఎఫ్ ఫ్రిగా చేసుకున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణం ఒక ఎత్తయితే దాని వాడకం మరో ఎత్తని, అందులో రన్నింగ్ వాటర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా డిగ్రీ కళాశాలలోను, లైబ్రరీ భవనం వద్ద, డై అండ్ నైట్‌కూడలి వద్ద మహిళలకు మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈ మూడు ప్రాంతాల వద్ద మహిళలు కోసమే ప్రత్యేకంగా పింక్ మరుగుదొడ్లను కొత్త రూపంలో మంచి నాణ్యతతో నిర్మిస్తామని వెల్లడించారు. శ్రీకాకుళంలో కమ్యూనిటీ మరుగుదొడ్లను మెట్రో సిటీలో ఉండేవిధంగా తయారు చేసి, ప్రతీ రోజు శుభ్రపరచే విధంగా ఉండాలని కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగంలో ఉన్న మరుగుదొడ్లు తప్పనిసరిగా వాడాలని, మరమ్మతులకు గురైన మరుగుదొడ్లను మరమ్మతులు చేసి రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పిస్తామన్నారు. బాగోలేని మరుగుదొడ్లను శుభ్రపరచి అక్కడ ప్రజలను ఆకట్టుకునే విధంగా బ్యూటిఫికేషన్ చేస్తే తప్పకుండా వస్తారని పేర్కొన్నారు. మరికొన్ని మరుగుదొడ్లు నుంచి రెవెన్యూ సమకూరే విధంగా బ్యూటిఫికేషన్‌తో పాటు యాడ్స్‌కు అవకాశాలు ఉండేటట్లు చేస్తామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు పత్రాలు మరుగుదొడ్లు లేని బెవర లక్ష్మి, మురపాక రమణమ్మ, మురపాక లక్ష్మి, ఇనపగుర్తి సత్యవతి, మండల నరసమ్మలకు కేంద్ర మంత్రి అందజేశారు. కేర్ ట్రాకర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మల్లేశ్వరరావు, పంచాయతీల నుంచి శ్యామలరావులను సన్మానించారు. అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్‌లను సందర్శించి సేంద్రియ ఎరువుల తయారీ విధానం, విక్రయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, డిపిఓ కె.భారతి సౌజన్య, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధర్‌రాజ, డ్వామా పిడి సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాషా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, రిటైర్డ్ ఆర్డీఓ పిఎంజె బాబు, తదితరులు పాల్గొన్నారు.





## 'జాప్' సేవలు నిరుపమానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జర్నలిస్టు వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆ వృత్తిలో ఉండేవారు సంపాదన కోసం కాకుండా సమాజం పట్ల బాధ్యతగా మెలిగాలని జర్నలిస్టు యూనియన్ నాయకులు శాసపు జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, జి.షన్ముఖరావు అన్నారు. జాప్ జిల్లా అధ్యక్షులు జి.షణ్ముఖరావు హితవు పలికారు. సమాజంలో పాత్రికేయులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, పాత్రికేయుల ప్రతిష్టను పెంచేవిధంగా జాప్ చేస్తున్న సేవలు నిరుపమానమని నేతృత్వంలో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) 32వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఖ్యాతి ఫౌండేషన్‌లో వృద్ధులకు దుప్పట్లు, స్వెట్లర్లు మంగళవారం పంపిణీ చేశారు. ఖ్యాతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్రావణి చిరు ఉద్యోగం చేస్తూ వృద్ధులకు చేతనైన సాయం అందిస్తున్నారని, అలాంటి వారికి చేయూతనివ్వాలనే ఆలోచనతోనే ఖ్యాతి ఫౌండేషన్‌లో వృద్ధులకు దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కొంక్యాన మురళీధర్, జర్నలిస్ట్‌లు బాలకృష్ణ పట్నాయక్, డాక్టర్ గెంజి ఎజ్రా, ఎంవీ సత్య నారాయణ, డోల శంకర్, పిన్నింటి అప్పన్న, సీపాన రమేష్, రౌతు సూర్యనారాయణ, శర్మ, కృష్ణకాంత్, కొండబాబు, రాధ, అల్లు ఉమామహేశ్వర రావు, ఆకుల కృష్ణ, కొంక్యాన శంకర్, శ్యామ్, పృద్వీ, ప్రభాస్ సూర్య, బొచ్చెన లక్ష్మణ్, ఆర్.వెంకట్, దుక్క రాజు, బి.భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షికి వినతి పత్రం అందించినట్లు తెలుగునాడు రాష్ట్ర వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ నల్లి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు పంగ మోహన్, కార్యదర్శి సత్యంతో కలిసి మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 14న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు విడుదల చేసిన ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని, సచివాలయ ఏఎన్ఎంలకు వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పనులు మాత్రమే కేటాయించాలని, ఏఎన్ఎంల రీడిప్లయ్‌మెంటు రద్దు చేయాలని, 100 శాతం గ్రాస్ శాలరీ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు అందేట్లు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62కు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తెలుగునాడు వైద్య ఆరోగ్య సంఘం వివిధ ప్రతినిధులు సూర్యనారాయణ, ప్రభాకర్, రవికుమార్, అరవింద కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిమ్స్ ఫలితాల్లో స్వరూపకు 430వ ర్యాంక్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గుజరాతీపేటకు చెందిన అంధవరపు స్వరూప ఆలిండియా ఎయిమ్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 430వ ర్యాంక్ సాధించి జిల్లా కీర్తిని చాటింది. ఇటీవల విడుదలైన ఎయిమ్స్ ఫలితాల్లో స్వరూప ప్రతిభ చాటడం పట్ల తండ్రి అంధవరపు శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఎల్‌కెజి నుంచి ఎనిమిదో తరగతి వరకు శర్వాణి విద్యానికేతన్‌లో స్వరూప విద్య అభ్యసించినట్టు ఆయన తెలిపారు. ప్రాథమిక దశలో విద్యకు పునాది పడడం వల్ల ఇది సాధ్యమైందని, ఇంటర్మీడియట్లో అధ్యాపకులు గైడన్స్ ఇవ్వడం వల్ల ఎయిమ్స్‌లో ఉత్తమ ఫలితాన్ని సాధించగలిగిందని తెలిపారు. ఆలిండియాలో 430వ ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, శర్వాణి విద్యానికేతన్ యాజమాన్యం స్వరూపకు అభినందనలు తెలిపారు.

• ఎడిటోరియల్

# ట్రంపే కరెక్ట్ మొగుడు

ట్రంప్ ఎన్నిక చాలా సంతోషాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కలిగించింది. లోకంలో పిచ్చోళ్లే ఎక్కువ ఉన్నారని కొందరి నమ్మకం. అందులో మనమూ ఒకరు కావచ్చు. అమెరికా ఈ ప్రపంచానికి పెద్దన్న అయితే, ట్రంప్ బిగ్‌బాస్. వెర్రి వాళ్లకి వెర్రివాడే రాజుగా వుండడం కరెక్ట్. అమెరికా అంటే మన దృష్టిలో స్టేటస్ సింబల్. పిల్లలు అక్కడున్నారంటే పల్లెలోని రచ్చబండ దగ్గర కూడా పిలిచి సీటు ఇస్తారు. మా వాడు, మా అమ్మాయి అంటూ కోతలు కోయొచ్చు. పల్లెల్లో వరికోతల కంటే ఇవే ఎక్కువ ఇప్పుడు. పిల్లలు కూడా హైదరాబాద్ చిలుకూరులో దేవుడు చుట్టూ తిరిగి, తిరుమలలో పొర్లు దండాలు పెట్టి వీసాలు సంపాదిస్తారు. ఎయిర్‌పోర్టులో వీడ్కోలు కన్నీళ్లలో చాలామంది జారిపడుతూ వుంటారు. విమానం ఎక్కగానే అమెరికా అని ఆనందంలో, మళ్లీ వాళ్లు ఎప్పుడొచ్చినా చుట్టపు చూపేనని విషాదాన్ని మరిచిపోతాం. డాలర్ వుంటే కాలర్ ఎగరేసుకు తిరగొచ్చు డాలర్ గుర్తు 'ఎస్' అనే అక్షరానికి నిలువు కోత. అదో అర్ధ సత్యం. సగం ఔను, సగం కాదు. పూర్తి నిజం ఎవరూ చెప్పరు. డబ్బున్న వాళ్లంతా తెలివైన వాళ్లని మన నమ్మకం. తెలివి లేనివాళ్లకి డబ్బు రాదు. అమెరికా తెలివైన దేశం. బీద ఆఫ్రికా దేశాలు తెలివిలేనివి. డబ్బు, తెలివి సమానార్థకాలు. తెలివైన అమెరికా, తెలివిలేని ట్రంప్‌ని ఎందుకు ఎంచుకుందని కొందరు అమాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచం అంతా ఒకటే ఫార్ములా. మన వార్డులో ఇద్దరు రౌడీలు కౌన్సిలర్లుగా నిలబడితే అందులో పెద్ద రౌడీని గెలిపిస్తాం. ఒకవేళ వీళ్లిద్దరికీ పోటీగా మంచోడు నిలబడితే, ఆ అవకాశం లేదు, నిలబడిన మరు క్షణం కాళ్లు విరగ్గొట్టి మూల కూచోపెడతారు. కుంటుతూ వెళ్లి నామినేషన్ వేస్తే, వాడికి డిపాజిట్ పోగొట్టి, బుద్ధి చెప్పి, ఆ రాత్రికి బార్‌లో పార్టీ చేసుకుని మెట్ల మీద దొర్లుకుంటూ ఇంటికెళ్తాం. మంచోడు ఎప్పటికీ రాజకీయాల్లోకి రాకుండా వుండడానికి వాడి ఇంటి ముందు ధర్నా చేస్తాం. సోషల్ మీడియా పోస్టులు పెట్టి, ఇంటిల్లిపాదిని వణికిస్తాం. రాజకీయాల్లోకి మేసేవాడు వస్తే మన కింత గడ్డి పెడ్తాడు. తిను, తినిపించు. చిల్లర విసిరి, నోట్లు ఏరుకో. ట్రంప్ వ్యాపారంలో వేల కోట్లు సంపాదించాడు. లైంగిక ఆరోపణలు ఉన్నాయి. క్రిమినల్ కేసులున్నాయి. ఓడినా దబాయించి గెలిచాను అనగలడు. తిక్క, వెర్రి, పిచ్చి అన్నీ కలిపి వ్యవహరించగలడు. ఇంతకు మించిన అర్హత ఏముంది? అన్ని దేశాల్లో, అన్ని ఊళ్లలో వీళ్లే కదా ఉన్నారు! అమెరికా దారిలోనే ప్రపంచం నడుస్తుంది. ప్రపంచాన్ని అమెరికా నడిపిస్తుంది. ట్రంప్ కరెక్ట్ నమూనా. అతని దగ్గర వేల ట్రంప్ కార్డులున్నాయి. క్రికెట్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడగలడు. కాకపోతే బాల్‌కి బదులు భూగోళం వుంటుంది. చిన్నప్పుడు అన్నం తినకపోతే పిల్లల్ని ఎత్తుకెళ్లే వాళ్లు వస్తారని భయపెట్టేవాళ్లు. ఎవడూ ఎత్తుకుపోకుండానే పెరిగి పెద్దవాళ్లయ్యాం. న్యూయార్క్ హార్బర్‌లో ఒకావిడ విగ్రహం వుంటుంది. చేతిలో కాగడాతో పిలుస్తూ వుంటుంది. మన దేశంలోని పిల్లలందరినీ ఎత్తుకుపోయే పనిలో వుంది. ట్రంప్, కమలా హారిస్ ఇరువురిలో ఎవరు గెలిచినా, ఓడినా 'అమెరికాతనం'లో మార్పుండదు. ఎందుకంటే బరాక్ ఒబామా మధ్య ప్రాచ్యంలో యుద్ధాన్ని ఆపించలేదు, జోబైడెన్ నాటోని విస్తరించడంలో భాగంగా ఉక్రెయిన్‌ని యుద్ధంలోకి తోసేశాడు, పాలస్తీనీయుల మీద మునుపెన్నడూ ఎరుగనంత దాడికి ఇజ్రాయేల్‌ని సిద్ధం చేశాడు. అమెరికన్లకి తమ ప్రయోజనాలే ముఖ్యం, మిగతావన్నీ తర్వాతే. మనుషులు మరీ స్వార్థపరులైపోయారు. స్వార్థం అనేకన్నా అహంకారం ఎక్కువైపోతోంది, అకారణ ద్వేషం పెరిగిపోతోంది, ఆధిపత్యం కావాలని కోరడం ఎక్కువైంది. దాన్ని ప్రదర్శించే ట్రంప్ కావాలి వాళ్లకు. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతోన్న మాంద్యంతో నిరుద్యోగిత, పేదరికం పెరిగిపోతోన్నప్పుడు వాటిని నియంత్రించలేని తనం మైనారిటీల మీదా, వలసల మీదా నెపం మోపి జనాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే రోజుల్లో ఎవరు బాగా రెచ్చగొడతారో వాళ్లే గెలవడం సహజం. చిత్రమేమంటే, సగటున అక్కడి భారతీయులు కూడా ట్రంపే గెలవాలనుకున్నారు. ఎందుకంటే తాము లోపలికి వచ్చేశాం, ఇక దేశానికి గేట్లు మూసేయాలనేది వారి వాదన. మరొకడు తమ దేశం నుంచి వస్తే, ఇలా ప్రతివోడూ వచ్చేస్తే అక్కడ తమదేశంలో తమ మైలేజీ పడిపోతుందని, ఇక్కడ సంపదలో వాటా పంచుకోవాల్సి వస్తుందని! ఇంత ఎన్నికల్లో రిలీఫ్ ఏమిటంటే.. మా కులస్తురాలు, మా ఇంటి ఆడపడుచు, మా మేనత్త కమాలా హారిస్ అమెరికాని ఏలుతోందని కూసే ఆధిపత్య కూతలని తట్టుకోవడం మనకు తరమయ్యేది కాదు!



సబ్యసాచి ముఖర్జీ.. ఫ్యాషన్ ప్రపంచంలో పరిచయం అక్కర్లేని పేరు. ఫ్యాషన్ డిజైనర్ గా కెరీర్ ప్రారంభించిన కొద్దికాలానికే దేశ విదేశాల్లో పేరు సాధించాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన న్యూయార్క్, లండన్ , మిలాన్ 'ఫ్యాషన్ వీక్ 'లో పాల్గొన్న ఏకైక భారతీయ డిజైనర్ గా చరిత్ర సృష్టించాడు. అతను డిజైన్ చేసిన దుస్తులు ధరించాలని, తమ పెళ్ళిలో ఒక్కటైనా అతని డిజైన్ ఉండాలని దేశంలోని ప్రముఖులు కోరుకుంటారు. లాక్మే ఇండియా ఫ్యాషన్ వీక్ లో అరుదైన డిజైన్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అటువంటి సబ్యసాచి ప్రశంసకు పాత్రులయ్యారు కొందరు అమ్మాయిలు. వారి వీడియో చూసి ఆశ్చర్యపోయి 'అసలైన విజేతలు వారే 'అన్నాడంటే తప్పనిసరిగా వారి గురించి తెలుసు కోవాలి.

# అసలైన విజేతలు!

ఎరుపు- భారతీయ సంప్రదాయంలో ఈ రంగుకు ఉన్న ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. ఏదో ఒక కాలానికో, సందర్భానికో లోబడికాక ఎక్కడైనా ఎప్పుడైనా సమున్నతంగా కనిపిస్తుంది ఎర్రటి రంగు. అందుకే వివాహాల్లో ఎరుపుది ముఖ్యపాత్ర. అదే ఉద్దేశంతో సబ్యసాచి 2023 లో ' హెరిటేజ్ బ్రైడల్ కలెక్షన్ ' పేరిట అద్భుతమైన పనితనంతో కూడిన వస్త్ర శ్రేణి పరిచయం చేశాడు. ఆ మోడల్ల వీడియో సోషల్ మీడియాలో వచ్చింది. ఇదే లక్నోకి చెందిన కొందరు మురికివాడల బాలికల్లో స్ఫూర్తి కలిగించింది. ఆ బాలలకు రకరకాల నైపుణ్యాలున్నాయి. కొందరికి కుట్టడం వచ్చు. మరికొందరికి ఎంబ్రాయిడరీ, వీడియోగ్రఫీ.. ఇష్టం. ఎదగాలనే తపన ఉంది.

దాతలు తమకు ఇచ్చే దుస్తులే పెట్టుబడిగా తమ నైపుణ్యం, సృజనాత్మకత జోడించి వారూ బ్రైడల్ కలెక్షన్ రూపొందించారు. అక్కడితో ఆగిపోలేదు. అచ్చం సబ్యసాచి షో మాదిరే వారూ ఫాషన్ షో తమ స్థాయిలో నిర్వహించారు. వీరంతా 12 నుంచి 17 ఏళ్ళ వయసువారే. వీడియోగ్రఫీ కూడా వారిదే. ఇన్నోవేషన్ ఫర్ చేంజ్ అనే స్వచ్ఛంద సంస్థ వారి కలల సాకారానికి సహాయపడింది. సబ్యసాచి వీడియోతో పాటు ఈ పిల్లలు డిజైన్ చేసి మోడలింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో పెట్టగానే అభినందనలు వెల్లువెత్తాయి. స్వయంగా సబ్యసాచి వారిని 'అసలైన విజేతలు' అని ట్విట్టర్లో ప్రశంసించగా, అదితిరావు హైదరి, ఇతర సెలెబ్రిటీలు స్పందించారు. వారికేమీ పెద్ద చదువులు లేవు. కానీ ఆసక్తి, తపన ఉన్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్ లో ఇదేమీ గొప్ప విషయం కాకపోవచ్చు. కానీ ఆ చిన్నారులకు గొప్ప విజయమే. ఈ రోజు మెచ్చుకున్నవారు ముందు ముందు వీరి డిజైన్లు కోరిచేయించుకుంటారేమో! ఏమో ! ఎవరు చెప్పగలరు? ఆర్థికంగా ఎదిగి ఈ బాలికలు తమదైన బ్రాండ్ దుస్తులు రూపొందించే రోజు కోసం ఎదురుచూద్దాం.

-కె. శోభ



"కంగువ"కి కొంచెం భయం గానే వెళ్లాల్సి వచ్చింది."ఎక్కడో కొడుతోంది శీనా" అని మనసు చెబుతూనే వుంది. కానీ వినం కదా. సినిమా స్టార్ట్ కాగానే ఒక గుడ్డి ముసలమ్మ చంద్రుని చూపిస్తూ ఏదో చెప్పింది (కాలం 1070). అర్థం కాలేదు. ఇంతలో 2024లోకి ఎంటరైంది. ఒక ప్రయోగశాల నుంచి పిల్లవాడు తప్పించుకున్నాడు. గోవాలో సూర్యమీద ఓపెన్ అయింది. యోగిబాబు, హీరో ఏదో గట్టిగా అరుస్తూ మాట్లాడుకున్నారు. దిశాపటాని ఇంకో కమెడియన్‌తో సీన్‌లోకి వచ్చింది. అందరూ అరుస్తున్నారు. ఓ 20 నిమిషాలు ఇదేం టార్చర్‌రా అనుకుంటూ వుండగా మళ్లీ 1000 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఒకడు పెద్ద వాయిస్ ఓవర్‌తో మ్యాప్‌లో పంచకోనల గురించి వివరించాడు. మనం ఎపుడూ చూడని, వినని ప్రపంచంలోకి తీసుకెళితేనే కదా పాన్ ఇండియా అంటారు. అన్ని భాషల వాళ్లకి సులభంగా అర్థం కావాలంటే అనాగరిక జాతుల్లోకి కథని తీసుకెళ్లాలి.

ఒకడెవడో వేరే పని లేనట్టు పెద్ద పడవేసుకుని రోమ్ నుంచి వచ్చాడు. ఈ ఐదు కోనల్ని స్వాధీనం చేసుకుంటే భారతదేశాన్ని ఆక్రమించుకుంటాడట. ఐదు కోనలంటే దేవరలోని ఐదు ఊళ్లు గుర్తుకొచ్చాయి. ఎన్టీఆర్ అతి సీరియస్‌గా స్మగ్లింగ్ చేస్తూ, డైలాగ్‌లు చెబుతూ , గ్యాప్‌లో సక్‌సక్‌మని అందర్నీ నరుకుతుంటాడు. సంగీతం కంటే సక్‌సక్ సౌండే ఎక్కువుంది. దేవరని ఇంకా మరిచిపోకముందే కంగువా వచ్చాడు. బర్బర జాతుల మధ్య కథ ప్రారంభమైంది. ఇక యాక్షనే యాక్షన్ అనుకున్నా. ఎండిపోయిన జుత్తు, ఒక గాజు కన్ను, ఉతకడం అసాధ్యమైన షోలాపురం దుప్పటిలాంటి బట్టలు కట్టుకున్న వందలాది మంది అరవడం స్టార్ట్ చేశారు. అరవడం ఆపిన మరుక్షణం ఒక ముసలాయన డైలాగ్ చెప్పాడు. తెలుగులా వుంది కానీ, అర్థం కావడం లేదు. పద్యం పాడినట్టు, నక్క ఊల వేసినట్టు మాట్లాడుతున్నాడు. మళ్లీ కోరస్‌లా అరుపులు. అప్పటి వరకు అవకాశం కోసం పొంచి వున్న మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ 113 రకాల విచిత్ర వాయిద్యాలతో స్పీకర్ల మీద దాడి చేశాడు. ఆ శబ్దానికి చెవుల్లో ఉన్న తుప్పుగిప్పు , గుబిలిగిబిలి ఎగిరిపోయి రెండు చెవుల మధ్య ఒక రకమైన శూన్యం ఏర్పడింది.



# కర్ణకఠోర కంగువ!

కనీసం సూర్య వస్తే అయినా కుదురుకుంటుందేమో అని ఆశించా. అప్పటికే నా సహచర ప్రేక్షకులు కొందరు సీట్ల మీద స్పృహ తప్పి, మరి కొందరు ఫిట్స్ రాకుండా బైక్ తాళాలు అరచేతిలో అదిమి పెట్టుకు కూచున్నారు. సూర్య కూడా రావడం రావడమే గట్టిగా అరుస్తూ, సక్‌సక్ సౌండ్స్‌తో, విచిత్ర ఆయుధాలతో దాడికి పూనుకున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ తన సంగీత బృందానికి చేసిన సైగతో వాళ్లు కూడా చైతన్యవంతులై ఢమరుకం, మృదంగం, తబలా, డ్రమ్స్ చేతికి ఏది దొరికితే అది వాయించసాగారు. యుద్ధం తర్వాత యుద్ధం. అరుపులు తర్వాత అరుపులు. సుదీర్ఘ బాదుడు తర్వాత ఉపశమనం కోసం ఇంటర్వెల్ ఇచ్చారు.

తెలివైన వాళ్లు థియేటర్ గోడలు దూకి పారిపోయారు. మెట్లు దిగే ఓపిక లేనివాళ్లు డ్రైనేజీ పైపుల సాయంతో జర్రున జారుతూ దూకేశారు. సినిమాని సమీక్షిస్తానని ఒక పెద్దాయనకి ఇచ్చిన మాట వల్ల, ఉరిశిక్ష పడిన ఖైదీలా లోపలికెళ్లాను.

పొగ తాగినా, మద్యం సేవించినా, ఈ సినిమా చూసినా పోతారు అని వినిపించి , ఇలా జరుగుతుందని అనుకోలేదు. జీవితం మునుపటిలా ఇంకెన్నడూ ఉండదు అని తెరమీద మసగ్గా కనిపిస్తూ వుండగా, మళ్లీ ఆట, వేట మొదలైంది. బాబీడియోల్ తన సైన్యంతో వచ్చి కసక్‌కసక్ అని సౌండ్ ఇచ్చాడు. సూర్య ఇక లాభం లేదనుకుని గ్రాఫిక్స్‌లో ఒక పెద్ద మొసలిని ఎత్తి పడేశాడు.

ఆ కుర్రవాడు కంగువా అని అరుస్తూ వుండగా, సూర్య "పులోమా" అని రీసౌండ్ చేస్తూ వుండగా, ప్రేక్షకుడు దేవుడా అని అరిచాడు. మనల్ని గత కాలం నుంచి విముక్తి చేస్తూ కథ మళ్లీ గోవాకి వచ్చింది.

ఇచ్చిన షాక్ చాల్లేదని ఈ సారి సూర్య ఏకంగా ఒక విమానానికే వేలాడాడు. మెషిన్‌గన్ బుల్లెట్‌కి, బుల్లెట్‌కి మధ్య గ్యాప్‌లో తప్పించుకుంటూ ఎట్టకేలకి పిల్లవాన్ని కాపాడాడు.

చివర్లో ఒక ట్విస్ట్. కష్టాలు కలకాలం వుండవు అనే ధర్మ సూత్రాన్ని అనుసరించి ఈ సినిమా కూడా అయిపోయింది. చచ్చిన పాముని మరింత చంపడానికి ఈ సినిమా పార్ట్-2 కూడా వుందని దర్శకుడు శివ ఒక స్లైడ్ వేశాడు. దాంతో కోపోద్రిక్తులైన కొందరు చెన్నైకి వెళ్లి శివని వెతకడానికి థియేటర్‌లోనే శపథం చేశారు.

అపస్మారక స్థితిలో గచ్చిబౌలి నుంచి ఇమ్లిబన్ లేదా ఇంజన్‌బౌలికి వెళ్లకుండా నేను మణికొండకే వెళ్లి, నా ఇంట్లోనే నిద్రపోవడం నా పూర్వ జన్మ అదృష్టం.

రాజపుత్ర రహస్యంలో ఎన్టీఆర్ టార్జాన్‌లా కేక పెడితే తట్టుకున్నాను. చిలిపి కృష్ణుడులో ఏఎన్‌ఆర్ పుస్తకాలు పట్టుకుని కాలేజీకి వెళ్లినా నా ధైర్యం చెక్కు చెదర లేదు. తుపాకి లోడ్ చేయకుండా కృష్ణ 32 సార్లు కాల్చడంతో పాటు పొగ కూడా ఊదినా భయపడలేదు. శోభన్‌బాబు డ్యాన్స్ చేసినా, కృష్ణంరాజు "కత్తి అందుకో జానకి నాయాల్ది" అని అరిచినా తట్టుకుని నిలబడిన సాహస ప్రేక్షకుడిని నేను.

అయితే కంగువా నన్ను కకావికలం చేసింది. ఎమ్జీఆర్, శివాజీగణేషన్ డబ్బింగ్ హారర్ సినిమాల్ని కూడా నేల మీద సిగరెట్ పొగల మధ్య చూసిన నన్నే జడిపించిందంటే కంగువా మామూలు కంగువా కాదు.

అరిచే సినిమాలు, అరవం సినిమాలు ఇంకెప్పుడూ చూడను జ్ఞానవేల్ రాజా. జ్ఞాననేత్రం తెరిపించావు.

- జీఆర్ మహర్షి

# స్టార్ హీరోయిన్ కర్వ్ ఫ్లెక్సిబిలిటీ

తన నటనా వృత్తికి మించి, జాక్వెలిన్ తన ఫిట్‌నెస్ వెల్‌నెస్ విషయంలో అంకితభావంతో అభిమానులను ప్రేరేపిస్తుంది. క్రమశిక్షణతో డైలీ వర్కవుట్లు, రూపాన్ని శ్రద్ధగా మెయింటెయిన్ చేయడంలో అవసరమైన నిబద్ధత చాలామందికి ప్రేరణ కలిగిస్తుంది. తాజాగా సయ్యద్ అమీనుద్దీన్‌తో డాన్స్ రిహార్సల్ సమయంలో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అద్భుతమైన ఫ్లెక్సిబిలిటీతో మైమరిపించింది. జాక్వెలిన్ తన అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్, ఉద్విగ్న నట ప్రదర్శనలతో వేడిని పెంచడంలో స్పెషలిస్ట్. ఇంతకుముందు 'సాహో'లో బ్యాడ్‌గాళ్ పాత్రలో జాకీ స్టన్నింగ్ ఎలివేషన్స్ డార్లింగ్ ఫ్యాన్స్ ని మరిగించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి డ్యాన్స్ ప్రాక్టీస్ సమయంలో జాక్విలిన్ భంగిమలకు సంబంధించిన ఫోటోలను షేర్ చేయగా అవి నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. జాక్విలిన్ బ్లాక్ స్కర్ట్.. థై హై షార్ట్ ధరించి డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించింది. డ్యాన్స్ నిపుణురాలైన అమీనుద్దీన్ శిక్షణలో జాకీ కొంత కఠినమైన జిమ్నాస్టిక్ ఫీట్స్ వేస్తూ కనిపించింది. ధూమ్ 3లో అమీర్ ఖాన్ ముందు స్టెప్పులు వేసే కత్రిన ఇలాంటి కఠినమైన జిమ్నాస్టిక్స్ చేసింది. ఇప్పుడు మళ్లీ జాక్విలిన్ అలాంటి జిమ్నాస్టిక్ డ్యాన్సులు ప్రాక్టీస్ చేస్తూ కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. ఇటీవల జాక్విలిన్ 200 కోట్ల మోసం కేసులో కాన్ మన్ తో పోరాటం వార్తలతోను నిరంతరం హెడ్ లైన్స్ లో కొస్తోంది. కాన్ మేన్ సుఖేష్ చంద్రశేఖర్ 200 కోట్ల మోసం కేసులో అతడి నుంచి బహుమతులు అందుకున్న వారి జాబితాలో జాక్విలిన్ పేరు వినిపించింది. అయితే ఇలాంటి అపప్రద నుంచి బయటపడేందుకు జాక్విలిన్ తనవంతు ప్రయత్నం చేస్తోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...





# దేశంలో మొబైల్ మొదటికాల్ ఎవరిది?

ఒక్క క్లిక్కుతో ప్రపంచంలో ఏం జరిగిందో తెలుసుకోగలుగుతున్నాం..గల్గతున్నాం.. జస్ట్ చేతుల్లో ఉంటే మనమనుకున్నదేదైనా ప్రపంచం మొత్తానికి తెలుపగల్గుతున్నాం.. సరిగ్గా ఉపయోగించుకుంటే అదే ఓ బడి, ఓ గుడి, గ్రంథాలయం, సినిమా టాకీస్, మార్కెట్, వాట్ నాట్..? చివరకు ఆన్‌లైన్ పెళ్లిళ్లు కూడా చేసుకునే ఓ ఎమోష నల్ డివైజ్. అదేనండీ మొబైల్ ఫోన్. పోను పోను కొత్త పుంతలు తొక్కుతూ స్మార్ట్ మొబైల్ ఫోన్ సృష్టిస్తున్న సాంకేతిక విప్లవం మాన వుడు సాధించిన ప్రగతికి ప్రతీక.. అదే స్థాయిలో ప్రమాదాలనూ మన ముందుంచుతున్న పరాకాష్ఠ. అయితే, మొట్టమొదట మన భారత్ లో మొబైల్ ఫోన్ ఎవరు వినియోగించారో మీకు తెలుసా..?అందుకు మనమోసారి కోల్‌కత్తా రైటర్స్ బిల్డింగ్ నుంచి ఢిల్లీలోని సంచార్ భవన్ వరకూ వెళ్లిరావాలి.

ఢిల్లీలోని సంచార్ భవన్ నుంచి ప్రధాని పీవీ నర్సింహారావు క్యాబినెట్‌లోని టెలికాం మినిష్టర్ సుఖ్‌రామ్‌కు ఓ కాల్ వచ్చింది. అదే మొట్టమొదటి మొబైల్ కాల్ కనెక్టివిటీ. అటు పక్కనుంచి చేసినవారు.. నాటి బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు. అలా 1995, జూలై 31న మొదటి మొబైల్ ఫోన్ కాల్ కనెక్టివిటీ అనేది కోల్‌కత్తా రైటర్స్ బిల్డింగ్ నుంచి ఢిల్లీ సంచార్ భవన్ మధ్య జరిగింది.

ఇప్పుడా ముఖ్యమంత్రి జ్యోతిబస్ లేడు.. నాటి కేంద్ర మంత్రి సుఖ్ రామ్ కూడా లేరు. కానీ, వాళ్లిద్దరి మధ్య 29ఏళ్ల క్రితం మొట్ట మొదటి సంభాషణగా ప్రారంభమైన మొబైల్ కనెక్టివిటీ ఇప్పుడు దావానంలా వ్యాపించింది. అది కొత్తపుంతలు తొక్కుతూ స్మార్ట్ ఫోన్ గా అవతరించింది. కమ్యూనికేషన్ వ్యవస్థలో కొత్తశకాన్ని ఆవిష్కరించింది. అయితే, అదే సమయంలో భారత్‌లో అత్యంత తక్కువ మొబైల్ ఆసక్తిపరులు, కనెక్టివిటీ ఉన్న ప్రాంతంగా కూడా నాడు మొట్టమొదటి కాల్ చేసిన జ్యోతిబస్ ముఖ్యమంత్రిగా ఉన్న పశ్చిమ బెంగాలే కావడం మరో విశేషం.

ఇప్పటికే భారతదేశంలో వందకోట్ల మందికి దగ్గరగా మొబైల్ వినియోగదార్లున్నట్టు తెలుస్తోంది. 2026కు వందకోట్లకు చేరుకోనున్నట్టుగా కూడా అంచనాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎక్కడో ఓ చోట ప్రతీ సెకన్‌కు ఓ మొబైల్ ఫోన్ అమ్ముడవుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి.

భారత్‌కు చెందిన బీకే మోడీ, ఆస్ట్రేలియా చెందిన టెల్స్ట్రా మధ్య జాయింట్ వెంచర్ గా మోడీ టెల్స్ట్రా నెట్ వర్క్ ఒకటి రూపొందింది. ఆ నెట్‌వర్కే ఇండియాలో మొట్టమొదటి కమ్యూనికేషన్ వ్యవస్థకు బీజం వేసింది. ఆ సమయంలో మొబైల్ కాల్ ధర ఆకాశాన్నంటేది. నిమిషానికి ఏకంగా 8 రూపాయల 40 పైసల చొప్పున ఔట్ గోయింగ్ కాల్స్ చేసేవారికి మాత్రమే కాకుండా ఇన్‌కమింగ్ కాల్ అందుకున్నవారూ బేర్ చేయాల్సివచ్చేది. ఇక ట్రాఫిక్ సమయాల్లో అయితే, నిమిషానికి 16 రూపాయల 80 పైసలు ఖర్చయ్యేవి. అంతే కాదు, నాడు మొబైల్‌ఫోన్ ఎవరు కొందరు రాజకీయ నాయకులు, వ్యాపార, సినీ ప్రముఖులకు మాత్రమే పరిమితమైన విలాస వస్తువు.

ధీరూభాయి అంబానీ రాకతో మొబైల్ ఒక విప్లవంగా మారింది. పండ్లు, కూరగాయలమ్మేవారి వద్దా మొబైల్ చూడాలనుకున్న ఆయన కలకు బీజం పడింది. ఇక 2016లో జియో రాకతో డాటా ప్లాన్స్, రకరకాల ఆఫర్స్‌తో మార్కెట్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మిగిలిన ఎయిర్ టెల్, ఐడియా, వొడాఫోన్ వంటి నెట్ వర్క్లకు బలమైన పోటీదారుగా మారి.. మొబైల్‌సర్వీస్ సాంకేతికతలో ఓ సంచలనం సృష్టించింది.

ఇవాళ మొబైల్ అంటే మనిషికి ఓ విడదీయరాని బంధం. మొబైల్ లోనే మనిషి స్విగ్గీ పేరిట భోజనం, టిఫిన్స్ కావల్సిన తినుబండారాలన్నీ తెప్పించుకోగల్గుతున్నాడు. బజారులో అడుగు పెట్టకుండానే.. మార్కెట్‌లో షాప్స్‌లో దొరికే వాటికంటే బెటర్ బట్టలను కొనుక్కోగల్గుతున్నాడు. కావల్సిన విజ్ఞానం, చూడాల్సిన పర్యాటకం, మొక్కాల్సిన దేవుళ్లు, కొనాల్సిన టిక్కెట్లు, చూడాల్సిన సినిమాలు, ఆ సినిమాలు తీసుకొచ్చే ఓటీటీలు, ప్రపంచాన్ని తెలుసుకునే వార్తలు.. ఇలా ఫలానాది ఇందులో ఇంకా తక్కువ ఉందనే అవకాశమివ్వనంతగా మొబైల్ స్మార్ట్ ఫోన్ అప్డేట్ అవుతూనే ఉంది.

ఇవాళ స్వీపర్ నుంచీ సీఈవో వరకూ కమ్యూనికేషన్ కోసం ఆధారపడే అతిపెద్ద నెట్‌వర్క్‌ను మొబైల్ రంగం సృష్టించింది. అందుకే, మొబైల్ రంగం భారత మార్కెట్‌లో బడా వ్యాపారులకు కామధేనువులా మారింది. పెట్టిన పెట్టుబడులకు తిరిగి భారీ లాభాలు రావడంతో కొత్త కొత్త ఫీచర్స్‌తో ఫోన్స్, అలాగే, సర్వీసులు ఇలా రెండూ పోటాపోటీగా ఈ కమ్యూనికేషన్ అనే సాంకేతిక రంగంలో దూసుకుపోతున్నాయి. 1999లో టెలికాం ఆపరేటర్స్ నుంచి లైసెన్స్ రుసుము వసూలు చేయడాన్ని సంస్కరణల్లో భాగంగా నాటి ప్రభుత్వం నిలిపివేయడం.. కేవలం ఆదాయపన్ను రూపేణ మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించడం కూడా మొబైల్‌సర్వీస్ ప్రొవైడర్స్‌కు అనుకూలంగా మారింది. ఆ తర్వాత టెలికాం ఇండస్ట్రీలో ప్రభుత్వం కూడా ఓ వాటాదారుగా మారడం.. 2003లో ఒక యూనిఫాం లైసెన్సింగ్ విధానాన్ని తీసుకురావడం.. వివిధ టెలికాం కంపెనీల సేవలకు ప్రత్యేకమైన లైసెన్సెస్ జారీచేయడం వంటి ఎన్నో విధానాలకు తెరతీసింది కేంద్రం.

ఇప్పటికే మొబైల్ ఫోన్ మానవుడి అవయవాల్లో ఒక్కటిగా మారిపోయిన పరిస్థితి. మ్యూజిక్ ప్లేయర్స్, వివిధ ఓటీటీ యాప్స్, ట్యాక్స్ పేమంట్స్ యాప్స్, లైసెన్సుల బరువును ప్యాకెట్స్‌లో మోయాల్సిన అవసరం లేని యాప్స్, మనమెక్కడుంటే అక్కడి నుంచి బిల్లులు చెల్లించే ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్‌పేలతో మొబైల్ మానవుడు సాధించిన అతిపెద్ద సాంకేతిక విప్లవం. అయితే, అదే సమయంలో శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్టుగా వీటన్నింటినీ ఉపయోగిస్తూ మనిషి ఏమాత్రం ఏమరుపాటు ప్రదర్శించినా హ్యాకర్స్ సైబర్ దాడులకూ గురయ్యే ప్రమాదాలతో మొబైల్ మనల్ని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉంటుంది.

అమెరికా వంటి చోటనైతే ఇప్పుడేకంగా కోర్టుల పని తగ్గించేలా కూడా విచారణలకు సంబంధించి టెక్స్ట్ మెస్సేజుల ద్వారానే కొన్ని పూర్తవుతున్నట్టు సమాచారం. ఇక పోలీస్, ఫైర్ సేఫ్టీ, నేరగాళ్ల వేట వంటివాటిల్లో మొబైల్ సిగ్నల్ వ్యవస్థను పట్టుకుని జస్ట్ గంటలు.. లేదా, రోజుల్లోనే నిందితులను పట్టుకునేంత వేగాన్ని మొబైల్ టెక్నాలజీ నిఘా వ్యవస్థలకందిస్తోంది. మొత్తంగా ఇవాళ సంచలనం సృష్టిస్తున్న ఈ మొబైల్ విప్లవానికి.. నాటి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబస్.. నాటి కేంద్రమంత్రి సుఖ్ రామ్ నోకియా హ్యాండ్ సెట్ తో మాట్లాడుకున్న ఫోన్ కాల్ మొదటిది కావడం విశేషం

– రమణ కొంటికర్ల



# ఇందిర.. తిరుగులేని విజ'యేందిర'!

**ఇందిరాగాంధీని విమర్శించడానికి వంద కారణాలు కనిపిస్తాయి.. అదేసమయంలో చప్పట్లు కొట్టడానికి కూడా వేయి కారణాలు కనిపిస్తాయి.. అందులో ఒకటి ప్రధానమైంది తలవంచుకోకపోవడం.. ఎంతటి గడ్డు పరిస్థితినైనా ఎదుర్కొనే ధీరత్వం.. ఒంటరిగానే కురుక్షేత్ర యుద్ధం చేయగల సాహసం. ఎస్, ఆ టెంపర్‌మెంట్ ఉంది కాబట్టే అప్పటి అమెరికా అధ్యక్షుడిని కూడా ఫోఫోవోయ్ అనేసింది.. పగబట్టిన పాకిస్థాన్‌ను నిలువునా చీల్చింది. దేనికైనా రెడీ అని ప్రకటించి మరీ అణుపరీక్షలు చేసింది. ఆమె ఫైటర్.. ఇప్పుడు పలు పార్టీల్లో ఉన్న బడా కుక్కమూతి పిందెలకు ఆమె ఫైటింగ్ టెక్నిక్స్ తెలియవు.. అసలు ఇవి కావు, నిజంగా ఇందిరను మెచ్చుకోవాల్సింది ఆమె జనంలోకి వెళ్లే తీరు..ఎమర్జెన్సీతో దేశవ్యాప్తంగా ఆమె మీద విమర్శలు.. తప్పు చేశాననే ఆత్మమథనం జరిగిందో లేదో గానీ అధికారం కోల్పోయాక ఆవరించిన అంధకారాన్ని తనే తరిమేసుకుంది. ఎవరి సాయమూ అక్కర్లేదు. జనంలోకి ఆమె వెళ్లిందో, తన బట్టలపై పడిన ఎమర్జెన్సీ బురదను జనం ప్రేమతోనే ఎలా కడుక్కుందో తెలియాలంటే, కొందరి, కొన్ని అనుభవాలు చదవాలి.**

## ఆమె ఓ పడిలేచిన కెరటం

"1975 ఎమర్జెన్సీ తరువాత ఎన్నికల్లో ఆమె చిత్తు చిత్తుగా ఓడిపోయింది. అతుకులబొంత సర్కారు ఏర్పడింది. సొంత పార్టీలోనూ ఆమెను అందరూ దూరం ఉంచేవాళ్లు. అతిరథమహారథులందరూ ఆమెతో మాట్లాడేవాళ్లు కాదు. చివరకు ఎమర్జెన్సీకి సమర్థించిన జలగం వెంగళరావు, బ్రహ్మానందరెడ్డిలతో సహా కురుక్షేత్రంలో అందరినీ కోల్పోయిన సుయోధనుడిలా మిగిలింది ఆమె. దేశ రాజకీయాల్లో ఆమె కథ క్లోజ్ అన్నారు అందరూ.. ఆవుదూడ గుర్తును కూడా బ్రహ్మానందరెడ్డి తన దొడ్లో కట్టేసుకున్నాడు.

అప్పుడు ఇందిర కదిలింది. వెంట ఎవరూ ఉండేవారు కాదు. జస్ట్, ఆమెలోని మొండితనం, ధైర్యమే ఆమెకు తోడు. ఇంట్లో కూర్చుని, చీకటిని తిడుతూ కాలం గడపలేదు. విస్తృతంగా పర్యటనలు చేసేది. వెంట పదిమంది కూడా ఉండేవారు కాదు. ఓరోజు మంగళగిరికి వచ్చింది ఆమె. ఓ గన్‌మ్యాన్, తోడుగా స్థానికుడు గోలి వీరాంజనేయులు అనే ఓ ఛోటా లీడర్.

కొన్ని ఇళ్లల్లోకి నేరుగా వెళ్లేది.. "నేను ఇందిరాగాంధీని.. మిమ్మల్ని కలవడానికి వచ్చాను" అనేది. నాయబ్ సాబ్ గల్లీలో ఓ ముస్లిం ఇంటికి వెళ్లినప్పుడు నేనూ వెంట వెళ్లాను. ఆరు బయట నులక మంచం వేసి ఉంది. ఇందిర దానిపై కూర్చుంది. ఇంతలో ఇంట్లోవాళ్లు బయటికి వచ్చారు. "మై అందర్ ఆసక్‌తీ హూ" (నేను లోపలకు రావచ్చా..?) అనడిగింది. రండమ్మా, రండి అని లోపలకు తీసుకుపోయారు వాళ్లు.. "తినడానికి ఏమైనా ఉందా..?" అందామె.

తడబడుతూనే వాళ్లు కూర సట్టి (గిన్నె) చూపించారు. చెంచాతో కాస్త కూర నోట్లో వేసుకుంది. రోజూ ఏం తింటున్నారు..? ఎలా ఉంటున్నారు..? ప్రభుత్వ సాయం, పథకాలు అందుతున్నాయా..? అనడిగింది. నాకైతే కళ్లు చెమర్చాయి. నెహ్రూ బిడ్డగా, ఈ దేశ యువరాణిలా సకలసౌఖ్యాలు అనుభవించిన ఆమె ఇలా రోడ్లెక్కిన తీరు బాధగా అనిపించినా ఇంతగా ప్రజలతో ములాఖత్ కావడం బాగా నచ్చింది. ఆ తరువాత ఏం జరిగింది..? ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. ఇందిర విజయేందిర అయ్యింది.

ఆ ఎన్నికల్లో తనను నమ్మినవాళ్లందరికీ టికెట్లు ఇచ్చింది. ఈ గోలి వీరాంజనేయులు కూడా ఉన్నాడు అందులో.. గతంలో కౌన్సిలర్‌గా ఓడిపోయిన ఆయన ఏకంగా ఎమ్మెల్యే అయ్యాడు. తరువాత మంత్రి కూడా.. ఇందిరా అంటే ఓ విశ్వాసం. తల ఎత్తుకుని, కొంగు బిగించి, ఒంటరిగానే బరిలోకి దిగే సాహసి ఆమె...

**ఆమెకు వేల కోట్ల సంపాదన కక్కుర్తి లేదు. తరతరాలకూ పోగేసి పెట్టాలనే చిల్లరతనం లేదు. తప్పులు చేసింది కొన్ని, కానీ తల ఎత్తుకునే, తెలిసే చేసింది. ఎందుకంటే ఆమె ఇందిర.. ఆ పదానికి ప్రత్యామ్నాయం లేదు. ఈరోజుకూ!!**

(ఎ.రజాహుస్సేన్ అనుభవాల ఆధారంగా..)

(ఈరోజు ఇందిర జయంతి)

## స్వచ్ఛ్ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ కుటుంబానికి సురక్షితమైన తాగునీరు జల్‌జీవన్ మిషన్ ద్వారా అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, స్వచ్ భారత్ మిషన్ గ్రామిన్, డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ అంశాలపై ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలసి సోమవారం సమీక్షించారు. స్వచ్‌భారత్ మిషన్ గ్రామిన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరిచి మహిళల ఆత్మ గౌరవానికి భంగం కలుగకుండా ప్రతీ ఇంటికి మరుగుదొడ్లు ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని కోసం పంచాయతీరాజ్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య వంతులుగా చేయాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా భూగర్భ జలాలు పెంచే నిర్మాణాలు, కట్టడాలు చేపట్టాలన్నారు. జిల్లాపరిషత్ ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులతో పైపులైన్లు, నీటిశుద్ధి యూనిట్లు ఏర్పరచాలని డ్వామా ద్వారా స్వయంసహాయక సంఘాలు, స్వచ్ఛందసంస్థలు సహకారంతో వీటిపై ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, బహిరంగ, దేవాలయ ప్రదేశాల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీపీఓ కె.భారతి సౌజన్య, జెడ్పీ సీఈవో ఎల్ఎన్వి.శ్రీధర్ రాజ, పీడీలు కిరణ్ కుమార్, సుధాకర్, డిఎంహెచ్ఓ డాక్టర్ బి. మీనాక్షి, డిఐపిఆర్ఓ కె.చెన్నకేశవరావు, రమణమూర్తి, వ్యవసాయ శాఖ జెడి త్రినాధ స్వామిలు పాల్గొన్నారు.




ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 25న కోటి దీపార్చన

**- తుమ్మావీధి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చురుగ్గా ఏర్పాట్లు -**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కార్తీకమాసంలో శివనామ జపం, శివునికి అభిషేకం, దీపారాధన చేయడం చేయడం, దీపోత్సవం.. దీప ప్రకాశం ఇంటింటికీ అందరికీ జ్ఞానం, మోక్షం కలుగజేస్తుంది. బయటి చీకటి నశింపజేస్తుంది. మనస్సులో ఉండే అసూయ, ద్వేషం తొలగించి జ్ఞానాన్ని ప్రసాదింపజేసే శక్తి దీపానికి ఉంటుంది. కోటిదీపోత్సవమంటే సామాన్యుల ముందుకు దేవదేవుళ్లను తీసుకువచ్చి పాల్గొనేలా చేయడం. దీపాలను వెలిగించి చీకటిని పారద్రోలడం, మనిషి జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకుంటూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం చాలా విశిష్టమైనది. ప్రతీనిత్యం దీపం వెలిగించడం కార్తీక మాసంలో శుభప్రదం. అలాంటిది ఇంత పెద్ద కార్యక్రమం మన జిల్లాలో జరుపతలపెట్టారు.

పుణ్యపువీధిలోని సీతారామచంద్రమూర్తి సహిత సువర్చల అభయాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, వీధి పెద్దలు సుంకరి కృష్ణకుమార్, ఎం.రామనారాయణరావు ఆధ్వర్యంలో కోటిదీపార్చన కార్యక్రమం ఈ నెల 25న నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు దీపార్చన పీఎస్ఎన్ఎం హైస్కూల్ వెనుక గల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కార్తీక బహుళ దశమి సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ద్వాదశ లింగార్చన, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు కోటి దీపోత్సవం, అనంతరం దశవిధ హారతులు, మహదాశీర్వచనాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయన సతీమణి స్వాతీశంకర్, ప్రముఖ వ్యాపారవేత్త దుప్పల వెంకటరావు, ప్రముఖ వైద్యనిపుణులు రాళ్లపాటి అరవింద తదితర పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు కోటిదీపోత్సవంలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు.

# ట్రూఅప్ ఛార్జీలు రద్దుచేయాలి

- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం
- సీపీఎం సీపీఐ నాయకులు పిలుపు
- ఎలక్ట్రికల్ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ట్రూఅప్ ఛార్జీలు రద్దుచేయాలని, విద్యుత్ స్మార్ట్‌మీటర్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఎలక్ట్రికల్ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, నివాస గృహాలకు కూడా మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్‌మీటర్ పెట్టడం నమ్మకద్రోహమే అన్నారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, ఆర్.ప్రకాష్, కొత్తకోట అప్పారావు, కె.సూరయ్య, చిన్నారావు, ఎ.లక్ష్మి, ఎం.గోపి, ఎల్.మహేష్, సీపీఐ నాయకులు ఎం.యుగంధర్, శ్రీను, లండ బాబురావు, చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

# శానిటరీ మేస్త్రిలను విధుల్లోకి తీసుకోపోతే పోరాటం ఉధృతం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘ ఆధ్వర్యంలో సానిటరీ మేస్త్రిలను విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాలరావు మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. మున్సిపల్ సానిటరీ మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులుగా సమ్మెలో ఉన్నా, ఊరు, వాడ దుర్వాసన వెదజల్లుతున్నా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికుల సమస్యల పరిష్కారం చేసి విధుల్లో పంపించకుండా మున్సిపల్ కమిషనర్, హెల్తాఫీసర్ తాత్సారం చేస్తున్నారని, వెంటనే వారినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో మేస్త్రుల సంఘం నుంచి అధ్యక్షుడు ముద్దాడ రామారావు, అల్లు రవి, టి.షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జి పెద్ద మనేద్ర, తారక, డి.రమణ, రసూల్, సోగ్గాడు, అర్జీ గణేష్, కె.తిరుమలరావు, సీతమ్మ, అర్జి లక్ష్మి, సరస్వతి సోషల్ మీడియా ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- **ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి**
- **అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేత**




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఏను మెళియాపుట్టి కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండల కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని యోగి కోరారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లా పార్వతీపురం జిల్లాలోకి వెళ్లిపోయిందని, జిల్లాల విభజన గత ప్రభుత్వం శాస్త్రీయంగా చేయలేదని, శ్రీకాకుళం జిల్లాకి ఐటిడిఏ ఏర్పాటు చేయాలని, అందుకు మెళియాపుట్టి అన్ని మండలాలకు భౌగోళికంగా దగ్గరగా ఉంటుందన్నారు. తక్షణమే మెళియాపూట్టి మండల కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలని, జిల్లా విభజన సమయంలోనే ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఆదివాసి ప్రజలు తరపున గతంలో కలెక్టర్‌కు మెమోరాండం అందజేశామని, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నాయకులు నాడు మెళియాపూట్టి మండల కేంద్రంగా ఐటిడి ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఏర్పడితే తప్పకుండా కృషి చేస్తామని బహిరంగ ప్రకటనలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రతిపక్ష హోదాలో పాతపట్నం బహిరంగ సభలో శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏ ఏర్పాటుచేస్తామని, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తామని, ఆదివాసి సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ప్రకటన చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తోందని, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, శ్రీకాకుళం జిల్లాకు మెళియపుట్టి కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. ఈమేరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం డే అండ్ నైట్ వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కి మెమొరాండం అందజేశారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఆదివాసి భవిష్యత్తు తరాల కోసం ఐటిడిఏ ఏర్పాటుకు అనేక ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించట్లేదని, భవిష్యత్తులో ఐటిడిఏ కోసం మరింత బలమైన ఆదివాసి ఉద్యమాలు నిర్మిస్తామని యోగి తెలిపారు. నిరసనలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మెళియాపుట్టి మండల అధ్యక్షులు గణేష్, బూర్జ మండల అధ్యక్షులు సవర శోభన్, సవర కృష్ణ, సారవకోట మండల అధ్యక్షులు భాస్కరరావు, దీనబంధుపురం సర్పంచ్ వెంకటేష్, ఆదివాసి సంక్షేమ జిల్లా సభ్యులు ఈశ్వరరావు, లచ్చుమయ్య, హరీష్ పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి / ఆకట్టుకున్న నాణాల ప్రదర్శన



**(సత్యంన్యూస్, లావేరు)**

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి స్థానిక పోస్ట్ మాస్టర్ ఏ.లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయులు అలిగి దూళికేశ్వరరావు పాతకాలం నాటి నాణేలు, 1770 నుంచి 2024 వరకు మన దేశంలో తయారైన 40 రకాల నోట్లు, 1835 నుంచి నాటి అణా, పరకాలతో పాటు ద్వాపర యుగం నాటి నాణాలను ప్రదర్శనలో ఉంచారు. అలాగే ఇతర దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లు, డాలర్లు ప్రదర్శించారు. అలాగే గ్లోబ్ ద్వారా ప్రయోగాత్మకంగా దేశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఆయనకు గ్రంథాలయం తరపున గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు శాలువతో సన్మానించి జ్ఞాపికనందజేశారు. అనంతరం గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమములో తెలుగు పండితులు శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# బహిరంగ మూత్ర విసర్జన హానికరం




**(సత్యంన్యూస్, రాజాం)**

బహిరంగ మూత్రవిసర్జన హానికరమని బొద్దూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నినాదాలు చేశారు. జాతీయ బహిరంగ మూత్ర విసర్జన రహిత దినోత్సవం సందర్భంగా జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ ఉపాధ్యాయులు అడపాక దామోదరరావు, ఇన్‌ఛార్జి హెచ్ఎం లక్ష్మీబాను, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కట్టుకోవాలని, అది ఆత్మ గౌరవానికి, ఆరోగ్యానికి ప్రతిబింబమని, ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం చేస్తుందని వివరించారు.

# స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి




**(సత్యంన్యూస్, కొత్తూరు)**

విద్యుత్ స్మార్ట్ మీటర్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, రమేష్, దుర్గారావు, క్రిష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆహార గిడ్డంగులు ఏర్పాటుచేయండి

**(సత్యంన్యూస్, పాతపట్నం)**

పాతపట్నం నియోజకవర్గంలో ఆహార ధాన్యాల నిల్వకు పాతపట్నం, హిరమండలం మార్కెట్ కమిటీ ఆవరణలో గిడ్డంగులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహార, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈమేరకు సచివాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే అత్యధిక గిరిజన జనాభా కలిగిన నియోజకవర్గం కావడంతో నిరుపేద గిరిజనులకు, ఇతరులకు తెల్ల రేషన్ కార్డుల స్థానంలో అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులను అధికంగా మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు.




# జర్నలిస్ట్ కుటుంబానికి చిరు సాయం

**(సత్యంన్యూస్, టెక్కలి)**

కొండ్రవీధిలో నివసిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ పి.అప్పయ్య పంతులు ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. అతనికి భార్య, మానసిక వైకల్యం గల కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మరణంతో భార్య, కూతురు కనీసం ఇంటి అద్దె కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వెంటనే స్పందించి 25 కేజీల బియ్యం, 20 రకాల నిత్యవసర వస్తువులతో పాటు రూ.6వేలు నగదు ఇంటి ఖర్చుల నిమిత్తం అందజేశారు. నిత్యవసర వస్తువును అభయం సేవా సంఘం సభ్యులు పంగ గురునాథ్ అందజేశారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు సంఘ సభ్యులు లాడే అనిల్, ఎన్.సింహాచలం, ధర్మవరపు పూర్ణచారి, మున్నా, ఉంగరాల గోవిందరావు పాల్గొన్నారు.



# నిధులు పారాయి.. నీరే 'చి'వరి'కి చేరలేదు

**(మొదటిపేజీ తరువాయి)**

వర్షపాతం నమోదు కాగా, 11 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. బ్యారేజీలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నా శివారు భూములకు మాత్రం ఈ ఏడాది నీరందలేదు. వేసవి సీజన్‌లో చేపట్టాల్సిన పనులు నీటిని విడిచిపెట్టిన తర్వాత జులైలో హడావుడిగా టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్, పూడిక తొలగింపు చేపట్టారు. కాలువ ప్రారంభంలో తొలగింపులు విడిచిపెట్టి శివారు ప్రాంతంలో చేపట్టడంతో నీరు చివరి వరకు చేరలేదు. పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు కొంతమేర చేపట్టినా పొట్ట, గింజ కట్టే దశకు చేరిన వరి పంటకు సాగునీరందలేదు. పలాస సబ్ డివిజన్ పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలకు చెందిన రైతులు సుమారు 22 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. శివారు ప్రాంతాలైన వజ్రపుకొత్తూరు మండలం బెండి, నారాయణపురం, పెద్దబొడ్డపాడు, సీతాపురం, తాడివాడ, పలాస, నందిగాం మండలం కణితివూరు, మర్లపాడు, హరిదాసుపురం, నారాయణపురం తదితర ప్రాంతాలకు సాగునీరు అరకొరగానే చేరింది. పంట చివరి దశలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురవడంతో కొంతమేర వరిపంట చేతికి వచ్చింది. లేదంటే ఈ ఏడాది అన్నదాతకు కడగండ్లే మిగిలేవి.

**కాలువ సామర్థ్యం తగ్గింది**

వంశధార ప్రధాన ఎడమకాలువ కెపాసిటీ 2,460 క్యూసెక్కుల నుంచి 1,800 క్యూసెక్కులకు పరిమితం కావడానికి ప్రధాన కారణం కాలువగట్లు బలహీనపడడం, పూడిక, గుర్రపుడెక్కలే. గొట్టాబ్యారేజీ వద్ద కాలువ సామర్థ్యం మేరకు 1800 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా టెక్కలి ప్రాంతానికి వచ్చేసరికి 500 క్యూసెక్కులకు తగ్గిపోతుంది. టెక్కలికి 900 క్యూసెక్కుల నీరు వస్తే తప్ప శివారు ఆయకట్టుకు నీరందే అవకాశం ఉండదు. అధికారులకు ఈ విషయం తెలుసు. శివారు ప్రాంతాలకు నీరు అందకపోవడానికి కారణం కాలువపై పరిమితికి మించి ఎత్తిపోతల పథకాలు ఉండటమేనన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. దీనికి తోడు 2007 నుంచి షట్టర్లు లేకుండా ఇసుక బస్తాలతో నీటితీరువా చేయడం వల్ల నీటి వృథాను అదుపు చేయలేకపోవడం ఒక కారణం. నీటి తీరువా అమలుకు 29 మంది లష్కర్లు ఉండాలి. కానీ ఆ స్థాయిలో లేరు. శివారు ప్రాంతాలకు నీరందకపోవడానికి కాలువపై అనధికారికంగా ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలనే కారణంతో వైకాపా హయాంలో ఎత్తిపోతలను ఆపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు 20 ఎత్తిపోతల పథకాలను పునఃప్రారంభించారు.

**బడ్జెట్ కేటాయింపులు లేవు**

బడ్జెట్‌లో ఆఫ్‌షోర్ కోసం రూ.35 కోట్లు కేటాయించారు. రూ.800 కోట్లు అవసరం ఉన్నచోట కేవలం 0.5 శాతం కేటాయిస్తే, అది నిర్వహణకు కూడా సరిపోదు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ఆధునికీకరణకు రూ.వెయ్యి కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదన పంపారు. బడ్జెట్‌లో దీని ఊసే లేదు. ఆధునికీకరణకు ఒక్కసారి బడ్జెట్ కేటాయించాల్సిన అవసరం లేదు. ఏడాది బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయిస్తే ఐదేళ్లలో ఎడమ కాలువ ఆధునీకీకరణతో పాటు శివారు ప్రాంతాలకు పుష్కలంగా నీరందించడమే కాకుండా కాలువను ఇచ్ఛాపురం వరకు తీసుకెళ్లొచ్చు. అంతకు ముందు టీడీపీ హయాంలో 2015లో అధునికీకరణకు రూ.600 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి మరిచిపోయారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా హయాంలోనైనా నిధులు కేటాయించివుంటే రూ.800 కోట్లతో పూర్తయ్యేది. అంచనాల దశలోనే ఉంటే ఏటా బడ్జెట్ పెరుగుతుంది కానీ, పని జరిగే అవకాశం ఉండదు.



జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆరో రోజు పిల్లలకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థినీ విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ఇస్తారని గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్లు ఎం.శివకుమార్, సీహెచ్ లక్ష్మణరావు, ఎన్.వెంకటరత్నం, పి.ప్రసన్నకుమారి, గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, పాలకొండ**



వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కొత్తూరు మండల కేంద్రంలో ఎంపీడీవో నీరజ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, బసవల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, కొత్తూరు**

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.